రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

రామయ్యకు నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, జనవరి 19: భద్రాచలం దేవస్థానం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు శుక్రవారం సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపజేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో కల్యాణం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

రామాలయంలో అన్నదానానికి రూ.లక్ష విరాళం

భద్రాచలం, జనవరి 19: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి దానవాయిపేటకు చెందిన భక్తుడు గుండు వెంకట సుధీర్, కుటుంబీకులు శుక్రవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. వారు ముందుగా రామయ్యను దర్శించుకుని, అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అధికారులకు చెక్కు అందజేసి, రసీదు స్వీకరించారు. ఏపీలోని చిత్తూరు జిల్లా చింతల పట్టెడ నగర్‌కు చెందిన పీడీ రఘురామన్–లోకేశ్వరి దంపతులు అన్నదాన కార్యక్రమానికి రూ.1,00,009 అందజేసి రసీదు స్వీకరించారు.

పెద్దమ్మ తల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచ రూరల్, జనవరి 19 : మండలంలోని జగన్నాధపురం, కేశవాపురం గ్రామాల మధ్య గల పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం శ్రీకనకదుర్గ అమ్మవారికి అర్చకులు ఘనంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయం ఎదురుగా ఉన్న అమ్మవారి జన్మస్థలం వద్ద ప్రత్యేక పూజలు చేసి పసుపు, కుంకుమ, గాజులు, ఒడిబియ్యం సమర్పించారు. పంచహారతుల కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈవో రజనీకుమారి, ఆలయ కమిటీ అధ్యక్షుడు మహీపతి రామలింగం, ధర్మకర్తలు పాల్గొన్నారు

విద్యార్థులకు స్వెట్టర్ల అందజేత

టేకులపల్లి, జనవరి 19: మండలంలోని గంగారం ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా వచ్చిన స్వెట్టర్లను శుక్రవారం ఇన్‌చార్జి హెచ్‌ఎం పీ నర్సయ్య అందజేసి మాట్లాడారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో విద్యార్థుల కోసం ఐటీడీఏ స్వెట్టర్లను అందజేసిందన్నారు. హెచ్‌ఎం పెండేకట్ల రామనాథం, వార్డెన్ దొడ్డ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాటేజీల నిర్మాణాన్ని పూర్తిచేయాలి

పాల్వంచ రూరల్, జనవరి 19 : కిన్నెరసానిలోని కాటేజీలను త్వరితగతిన పూర్తిచేసి, ఆనంద ద్వీపంలో ఏకో పార్కు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ వైల్డ్‌లైఫ్ అధికారులను ఆదేశించారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన కిన్నెరసానిని ఆమె శుక్రవారం సందర్శించారు. నిర్మాణంలో ఉన్న అటవీశాఖ వైల్డ్‌లైఫ్ భవనాలు, రిజర్వాయర్ మధ్యలో ఉన్న ఆనందద్వీపం, గ్లాస్ బిల్డింగ్, కాటేజీల నిర్మాణాలను పరిశీలించారు. ఎఫ్‌డీవో కృష్ణాగౌడ్, సీసీఎఫ్ భీమానాయక్, రేంజ్ ఆఫీసర్లు శ్రీనివాస్, హారిక పాల్గొన్నారు.

మొక్కల పెంపకం చేపట్టాలి

అన్నపురెడ్డిపల్లి, జనవరి 19: మండలంలోని నర్సరీల్లో మొక్కల పెంపకం చేపట్టాలని అడిషనల్ డీఆర్‌డీవో రవి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలన్నారు.

ఇల్లెందు రూరల్, జనవరి 19: మండలంలోని మొండితోగు, తిలక్‌నగర్, విజయలక్ష్మి నగర్, మిట్టపల్లి, కొమ్ముగూడెం నర్సరీలను ఎంపీడీవో బాలరాజు శుక్రవారం పరిశీలించారు.

టేకులపల్లి, జనవరి 19: మండలంలోని బేతంపూడి పంచాయతీలోని నర్సరీలను ఏపీవో కే శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని, బ్యాగుల్లో మట్టితో పాటు విత్తనాలు నింపాలని, క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీనాకుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

పాల్గొన్న పోలీస్ అధికారులు →

నేరస్తులకు శిక్ష పడాలి

రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి
పోలీస్ అధికారులతో ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, జనవరి 19 : నేరస్తులకు శిక్షపడేలా పోలీసు అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ బిరుద రాజు రోహిత్‌రాజు అన్నారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించాక జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో తొలిసారిగా కొత్తగూడెం ఐఎంఏ హాల్‌లో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వివిధ సమస్యలతో పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రజలతో మమేకమై వారిలో పోలీస్‌శాఖపై మరింత నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేకూర్చాలన్నారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను 'బ్లాక్ స్పట్స్'గా గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఈ. విజయ్‌బాబు, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, పాల్వంచ డీఎస్పీ ఎన్. వెంకటేశ్, ఇల్లెందు డీఎస్పీ కేవీ రమణమూర్తి, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, సైబర్ క్రైమ్ డీఎస్పీ ఎ.కృష్ణయ్య, జిల్లాలోని అన్ని ప్రాంతాల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఆటల పోటీలు

కొత్తగూడెం టౌన్, జనవరి 19 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టుల ఆవరణలో నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. శుక్రవారం ఈ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్ ప్రారంభించారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదుల గుమస్తాలు పోటీల్లో పాల్గొన్నారు. మొదటి అదనపు జిల్లా జడ్జి శ్యాంశ్రీ, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, ఫస్ట్ ఎడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ సుచరిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్ మక్కడ్, ఉపాధ్యక్షుడు దుంద్రా రమేశ్, ప్రధాన కార్యదర్శి రావి లాల రామారావు, జాయింట్ సెక్రటరీ కాసాని రమేశ్, పిట్టల రామారావు, యాసా యుగేందర్, మనోరమ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

మ్యూజికల్ చైర్ ఆట ఆడుతున్న మహిళా న్యాయవాదులు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈవో

బాలోత్సవ్ ప్రారంభం

కొత్తగూడెం టౌన్, జనవరి 19 : సామాజిక మార్పు, పురోగతికి బాలోత్సవ్ కార్యక్రమాలు ఉపకరిస్తాయని బాలోత్సవ్ చిల్డ్రన్స్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు, నిర్వాహకుడు డాక్టర్ వాసిరెడ్డి రమేశ్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో పోటీలను ఆయన ప్రారంభించారు. సుమారు 350 మంది విద్యార్థులు హాజరయ్యారు. డీఈవో వెంకటేశ్వరచారి, రామకృష్ణారెడ్డి, ఏలియా, స్వర్ణ, రవికుమార్, రమేశ్, మధుసూధన్‌రావు, సూర్యనారాయణ, మల్సూర్ పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదు శిబిరాలు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం హైదరాబాద్ నుంచి కలెక్టర్, ఇతర అధికారులతో సమీక్షించారు. ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపుల కోసం వచ్చేనెల 8వ తేదీ వరకు శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు ప్రతీక్ జైన్, డాక్టర్ రాంబాబు, శిరీష, మంగీలాల్, కాశయ్య పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు సజావుగా సాగాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 19: ఈ నెల 29న పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని డీఈవో ఆదేశించారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల నోడల్ అధికారులు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలతో శుక్రవారం జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 20వ తేదీన జరిగే తల్లిదండ్రుల సమావేశంలో ఎన్నికల గురించి అందరికీ తెలియజేసి ప్రతి విద్యార్థి తల్లి లేదా తండ్రికి వ్యక్తిగతంగా ఆహ్వానాలు అందించాలని అన్నారు. జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారులు సైదులు, ఆర్‌పీలు సాయికృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

మావోయిస్టు సానుభూతిపరులు ఏడుగురి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్

ఇల్లెందు, జనవరి 19: మావోయిస్టులకు పేలుడు పదార్థాలు సరఫరా చేస్తున్న ఏడుగురిని భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కరుణాకర్ ఇల్లెందు పట్టణ పోలీస్ స్టేషన్ వివరాలు వెల్లడించారు. పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈక్రమంలో వారికి అనుమానాస్పదంగా ఏడుగురు వ్యక్తులు తారసపడ్డారు. పోలీసులు వారిని తమదైన శైలిలో విచారించి మావోయిస్టు సానుభూతిపరులుగా గుర్తించారు. వారి నుంచి 400 జిలెటిన్ స్టిక్స్, 1000 డిటోనేటర్లు, మూడు బండిళ్ల విద్యుత్ తీగను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను భద్రాద్రి జిల్లా ఇల్లెందుకు చెందిన జెడిపేటీ రమేశ్, ఖమ్మం జిల్లా కారేపల్లి క్రాస్‌రోడ్‌కు చెందిన బొడస నర్సింహా, మహబుబాబాద్ జిల్లా గిరిప్రసాద్‌నగర్ కాలనీకి చెందిన మహమ్మద్ యాకూబ్‌పాషా, ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన అలకుంట వెంకన్న, ఒడిశాకు చెందిన సున్నం కన, సున్నం గంగ, మడకం లచ్చగా గుర్తించారు. వారిపై కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

సర్పంచ్, ఉప సర్పంచ్ చెక్కు పవర్ నిలిపివేత

దమ్మపేట రూరల్, జనవరి 19: దమ్మపేట సర్పంచ్, ఉపసర్పంచ్‌ల చెక్ పవర్‌ను నిలిపివేస్తూ జిల్లా కలెక్టర్ ప్రియాంక అల ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020–21 సంవత్సరంలో రూ.5,49,750/– నిధులు దుర్వినియోగం జరిగినట్లు విచారణలో రుజువైందన్నారు. ఈ నిధులను రెవెన్యూ రికవరి యాక్టు ప్రకారం రికవరీ చేయాలని ఆదేశిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు

అన్నపురెడ్డిపల్లి, జనవరి 19: వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులతో అధిక లాభాలు పొందవచ్చని హైద్రాబాద్ ఈఈఐ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అబ్బుగూడెంలో ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్, ఎవర్‌గ్రీన్ ఎనర్జీ ఎంటర్‌ప్రైజెస్ అధికారులు నాబార్డ్ వారి సహకారంతో డిజిటల్ సేవల ద్వారా రైతుల లాభదాయకతను పెంపొందించేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ ప్రమీల, జిల్లా ఉద్యానశాఖ అధికారి మరియన్న, వ్యవసాయశాఖ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ, ఈఈఐ శాస్త్రవేత్తలు, నాబార్డ్ అధికారులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

మణుగూరుటౌన్, జనవరి 19: పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన తరంగపూడి వెంకటరమణ 16నెలల కుమారుడు అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న నాసిరెడ్డి వినయ్‌కుమార్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు శుక్రవారం అందజేశారు.

పాఠశాలకు ఫర్నిచర్ అందజేత

అశ్వాపురం, జనవరి 19: మండలంలోని మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకుడు తొలి ఉపాధ్యాయుడు స్వర్గీయ తిప్పారెడ్డి నారాయణరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు తిప్పారెడ్డి విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం పాఠశాలకు ఫర్నిచర్‌ను పాఠశాల హెచ్‌ఎం కొండవీటి గోపి వరప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, పెద్దలు జాలె రామకృష్ణారెడ్డి, బండారు రవీందర్‌రెడ్డి, రణబోతుల రామిరెడ్డి, మిలట్రీ వెంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్ పట్టివేత

పాల్వంచ, జనవరి 19 : రాతిచెరువు సమీపంలోని నెహ్రూనగర్ వద్ద ఉన్న ఓ హాస్టల్‌లో టిప్పర్లతో మట్టి తోలుతున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. ఆర్‌ఐలు రవీందర్, హచ్చాలు తమ సిబ్బందితో కలిసి హాస్టల్ వద్దకు చేరుకున్నారు. వీరిని గమనించిన అక్రమార్కులు పారిపోయారు. మట్టి టిప్పర్‌ను తహసీల్ కార్యాలయానికి తరలించారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన గెర్షోమ్

కొత్తగూడెం టౌన్, జనవరి 19 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను గాంధీపథం చారిటీ సర్వీసెస్ అధ్యక్షుడు చింతలచెర్వు గెర్షోమ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గద్దరన్న కుమార్తె వెన్నెలకు నామినేటెడ్ పదవి కేటాయించాలని కోరారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. స్థానిక సమస్యలపై చర్చించారు.

రేపు పాల్వంచలో రథయాత్ర

పాల్వంచ, జనవరి 19 : పట్టణంలోని భజనమందిరంలో ఉన్న శ్రీ సీతారామ ఆలయంలో ఈ నెల 21వ తేదీ ఆదివారం నిర్వహించే రథయాత్రను భక్తులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహక కన్వీనర్ వేణు పిలుపునిచ్చారు. శుక్రవారం రామాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ రథయాత్రలో కోలాటం, భరతనాట్యం, భక్తిగీతాలు, పూజలు ఉంటాయని పేర్కొన్నారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్ చలువాది ప్రకాష్, వేణు, పెండ్యాల రోజాలక్ష్మి పాల్గొన్నారు.

సారపాకలో శ్రీరామ శోభాయాత్ర

సారపాక, జనవరి 19: అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సాకేతపురి(సారపాక)లో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు శ్రీరామ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర జిల్లా ప్రముఖ్ ఒరుగంటి సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శోభాయాత్రకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

కావలెను

★మన పట్టణంలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్ నందు పని చేయుటకు ఇంటర్, డిగ్రీ, బి.టెక్, PG చదివిన అభ్యర్థులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సెల్: 9640248588, 9365043965.
NTW-323057

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

EDUCATION

★Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.
NT-319803-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

కార్యదర్శి లేటు.. జనం మండిపాటు

చండ్రుగొండ, జనవరి 19: మండలంలోని వెంకటియాతండా పంచాయతీలో శుక్రవారం ఉదయం గ్రామసభ జరుగాల్సి ఉండగా ఉదయం 11 గంటలు దాటినా పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, పాలకవర్గ సభ్యులు ఎవరూ హాజరు కాకాపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా పంచాయితీ కార్యదర్శి స్థానికంగా ఉండకుండా రెండు రోజులకోసారి ఒక్కసారి వస్తూ పోతుంటారని, అధికారుల పర్యవేక్షణ ఉన్నప్పుడే వస్తారని గ్రామస్తులు ఇస్లావత్ వీరన్న, మల్సూర్, మోహన్, మూడ్ రమేశ్, ఇస్లావత్ రవి, బాలు ఆరోపించారు. సమయ పాలన పాటించని గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

అశ్వారావుపేట, జనవరి 19: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణారావు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి రూ.10 చొప్పున మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు రూ.10 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ బాధ్యులు వీరేశ్వరరావు, వెంకటేశ్వర్లు, హరినాథ్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దమ్మపేట రూరల్, జనవరి 19: మధ్యాహ్న భోజన వర్కర్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. దమ్మపేటలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె చేయనున్నామన్నారు. ఈ నెల 23న ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు, ఫిబ్రవరి 5న మండల కేంద్రాల్లో ధర్నాలు చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు సునీత, రామకృష్ణ, రాంప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట రూరల్: మాట్లాడుతున్న పిట్టల అర్జున్

వివాహిత ఆత్మహత్య

చండ్రుగొండ, జనవరి 19: కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సీతాయిగూడెం గ్రామానికి చెందిన పిట్టల సాంబయ్యకు వేంసూరు మండలం వైఎస్ఆర్ బంజర గ్రామానికి చెందిన శివరాణి (27)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. కొంత కాలంగా శివరాణికి తరచూ కడుపునొప్పి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నది. గురువారం కడుపునొప్పి రావడంతో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి నాగేశ్వరరావు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై మాచినేని రవి కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

పురుగుల మందు తాగి విద్యార్థి..

చండ్రుగొండ, జనవరి 19: పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు, పోలీసులు తెలిసిన వివరాలు.. మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తలారి ముత్తయ్య పెద్ద కుమారుడు సూర్యప్రకాశ్(15) పెనుబల్లి మండలం వీఎం బంజర ఎస్సీ బాలుర వసతి గృహంలో పదో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. సెలవులు అయ్యాక హాస్టల్‌కు వెళ్లమని తల్లిదండ్రులు సూర్యప్రకాశ్‌కు చెబుతున్నారు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో ఎస్సై మాచినేని రవి కేసు నమోదు చేశారు.

వంట మనిషి ఏర్పాటుకు ఆహ్వానం

అన్నపురెడ్డిపల్లి, జనవరి 19: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తాత్కాలికి పద్ధతిన వంట మనిషి నియామకం కోసం మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18నుంచి 42 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళలు అర్హులని, 10వ తరగతి చదివి ఉండాలని, నివాస ధృవపత్రం, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జత చేసిన దరఖాస్తును పాఠశాలలో ఈ నెల 24 లోపు ఇవ్వాలని తెలిపారు.

బ్యాంకుల సేవలపై అవగాహన

అశ్వారావుపేట రూరల్, జనవరి 19: పేదల కోసం బ్యాంక్‌లు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ, నాగార్జున గ్రామీణ బ్యాంక్ మేనేజర్లు జే శ్రీనివాస్, పరందామరెడ్డి అన్నారు. మండలంలోని అనంతారం, గాండ్లగూడెం, మల్లాయిగూడెం, కన్నాయిగూడెం గ్రామాల్లో వేర్వేరుగా 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో భాగంగా అవగాహన సదస్సులు నిర్వహించారు.

'ఎమ్మెల్సీ' ఓటు నమోదు చేసుకోవాలి

సారపాక, జనవరి 19: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ తిరుమలాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మెమో ఒరిజినల్ లేదా ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఓటరు ఐడీ, పాస్‌ఫొటో, ఆధార్‌కార్డు, ఫోన్‌నెంబర్, ఈ మెయిల్ ఐడీ అందజేయాలన్నారు. ఫిబ్రవరి 6వ తేదీలోగా నమోదు చేసుకుని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

మొబైల్ షాపులో చోరీ

పాల్వంచ, జనవరి 19 : పాల్వంచ బస్టాండ్ సెంటర్‌లోని ఓ మొబైల్ రిపేరింగ్ షాపులో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. నూతన్ మొబైల్‌షాపు ప్రజా మరుగుదొడ్లను ఆనుకొని ఉంది. వెనుకవైపు నుంచి గోడను పగులగొట్టి లోనికి చొరబడి పది సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. షాపులో ఉన్న రిపేర్‌కు వచ్చిన పాత మొబైల్స్, బ్లూటూత్, హెడ్‌సెట్, చార్జర్‌లు ఇలా అన్నింటిని తస్కరించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ఏరియాలో చోరీ జరగడం ఇది రెండోసారి. షాపు యజమాని వినయ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

ఇల్లెందు, జనవరి 19: కాంగ్రెస్ ఎన్నికల ముందు మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లుగా తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ పథకాలను అందించి ఆదుకోవాలని ఉద్యమకారుల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యకు క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. ఆయనను సన్మానించారు. నాయకులు పులిగండ్ల మాధవరావు, మేకల శ్యాం, రమేశ్‌గౌడ్, భావ్‌సింగ్, ఆదూరి రవి, పడిదల నవీన్, ఎర్రబెల్లి కృష్ణయ్య పాల్గొన్నారు.

భద్రాచలంలో నేడు విద్యుత్ అంతరాయం

భద్రాచలం, జనవరి 19: భద్రాచలం పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ డీఈ జీవన్ కుమార్ ఓ ప్రకటనలతో తెలిపారు. కరెంట్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగింపు, కొన్నిచోట్ల మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9.00 నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి నృసింహస్వామి దీక్షలు

భద్రాచలం, జనవరి 19: పట్టణంలోని అహోబిల మఠంలోగల నృసింహస్వామి ఆలయంలో నృసింహ దీక్షలను శనివారం ప్రారంభిస్తున్నట్లు నృసింహ సేవావాహిని వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. 32 రోజులపాటు కొనసాగే ఈ దీక్ష.. అశ్వమేధాది శత క్రతు యాగాలతో సమానమని పేర్కొన్నారు. దీక్ష చేపట్టిన వారికి అల్పాహారం, భిక్ష అందించేందుకు దాతలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు

దుమ్ముగూడెం, జనవరి 19: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో మంగీలాల్ హెచ్చరించారు. మండలంలోని తూరుబాకలో ఇసుక క్వారీని శుక్రవారం పరిశీలించారు. ఇతర వాహనాలు లోనికి రాకుండా జేసీబీతో ట్రంచ్ తవ్వించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, గనుల శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ జి.నిరంజన్, గిర్దావర్లు ఆదినారాయణ, పి.లక్ష్మయ్య, సర్వేయర్ సున్నం నర్సయ్య పాల్గొన్నారు.

వేగంగా ఫిజియోథెరపీ సెంటర్ పనులు

రామవరం, జనవరి 19 : ఇటీవల సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల్లో ఆర్థోపెడిక్ సమస్యలు పెరుగుతుండడంతో ఫిజియోథెరపీ అవసరం పెరుగుతూ వస్తోంది. దీంతో సింగరేణి ప్రధాన ఆస్పత్రిలో ఫిజియోథెరపీ సెంటర్ ఏర్పాటు చేయాలని టీఆర్‌ఎస్ అనుబంధ గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో కార్మికప్రాంతంలో పెద్ద ప్రాంతమైన రుద్రంపూర్ డిస్పెన్సరీలో సుమారు రూ.5 లక్షల వ్యయంతో ఫిజియోథెరపీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే ఫిజియోథెరపీ సేవలు ఇక్కడే పొందవచ్చని కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

22న గాయత్రి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

దమ్మపేట రూరల్, జనవరి 19: ఈ నెల 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని స్థానిక గాయత్రి ఆశ్రమంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు మూర్తీజి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మణ సమేత సీతారామాంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలకు 108 బిందెలతో అభిషేకం నిర్వహించి, భక్తులకు క్షీర్ బోగ్ ప్రసాద వితరణ చేస్తామన్నారు.

న్యాయం చేయాలని వినతి

ఇల్లెందు, జనవరి 19: పట్టణంలోని 18వ వార్డులో కలెక్టర్ కేటాయించిన దోభిఘాట్ స్థలం తమదని కొందరు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, వారిని నివారించి తమకు న్యాయం చేయాలని రజక సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్ కోట రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. దోభిఘాట్ పనులు జరుగుతున్న స్థలాన్ని, అక్కడ నిర్మించిన సీసీ రోడ్డు, సింగరేణి వేసిన హద్దులను అర్థరాత్రి జేసీబీతో ధ్వంసం చేశారన్నారు. నాయకులు దుంపటి కృష్ణ, కాసర్ల శ్రీనివాస్, మల్లయ్య, రాజు, సాతల్ల గిరి, సత్యనారాయణ, రమేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి

ఇల్లెందు రూరల్,జనవరి 19: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది.శుక్రవారం మండల పరిధిలోని పోలారం పంచాయతీ బొంబాయి తండా గ్రామానికి చెందిన గుగులోత్ పవన్ (17) ఈనెల11వ తేదీన కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుల మందు సేవిచాడు.స్థానికులు,కుటుంబ సభ్యులు హుటాహుటిన ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం వైద్యశాలకు రిఫర్ చేశారు.చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఎస్‌సీఆర్‌ఈఎస్ కమిటీలోకి జేమ్స్‌పాల్

కొత్తగూడెం టౌన్, జనవరి 19 : సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ట్రై అన్యువల్ జనరల్ బాడీ సమావేశాన్ని సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్ వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా జేమ్స్‌పాల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌సీఆర్‌ఈఎస్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య నాయకత్వంలో డివిజనల్ సెక్రటరీ ప్రభురాజ్, బ్రాంచి సెక్రటరీ కొత్త మురళీకృష్ణ, ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు జేమ్స్‌పాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను పలువురు నాయకులు అభినందించారు.